క్లుప్తంగా

భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండాలి



నవాబుపేట: కేజీబీవీలో విద్యార్థినులకు అందించే భోజనం విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఎంపీడీఓ జయరాంనాయక్ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని కేజీబీవీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వంటశాల, ఆహార పదార్థాలు తదితర వాటిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిశుభ్రత పాటించాలని వివరించారు. ఎంఈఓ నాగ్యానాయక్, బద్రునాయక్, నరేష్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకద్ర: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ బాలరాం ఆదేశించారు. మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలన్నారు. భోజనాన్ని హెచ్‌ఎం ప్రతి రోజు పరిశీలించాలని సూచించారు.

'యూపీఎస్'తో ఉద్యోగులను మభ్యపెట్టే ప్రయత్నం



పాలమూరు: యూపీఎస్ పేరుతో ఉద్యోగులను మభ్యపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ అన్నారు. మార్చి 2న యూపీఎస్‌పై నిర్వహించే యుద్ధభేరి పోస్టర్లను శనివారం జెడ్పీ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఏప్రిల్ ఒకటి నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న యూపీఎస్ విధానంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాలు మరింత దుర్భరం అవుతాయన్నారు.గడ్డం వెంకటేష్, రాఘవేందర్‌రెడ్డి, ఇనాయత్ శాంసన్, శ్రీనివాస్‌రావు, శ్రీహరి, మోసీన్, శేఖర్ పాల్గొన్నారు.

రేపు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



చిన్నచింతకుంట: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి పి.యాదగిరి తెలిపారు. శనివారం ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రైతులతో కలిసి ఆయన విడుదల చేశారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ ఆధ్వర్యంలో మహేంద్ర ప్రైడ్ ట్రెనింగ్ క్లాసెస్ వారం రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ శిక్షణలో 60 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలతో డిగ్రీ పూర్తయిన వెంటనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకునే అవకాశముందని, ఇలాంటి కార్యక్రమాలను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ముంతాజ్ జహాన్, కోఆర్డినేటర్ హరిబాబు, రాజవర్ధన్ రెడ్డి, స్వరూప, శ్యాంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వే ప్రశాంతం

జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్‌లో రెండో రోజు సర్వే ప్రశాంతంగా కొనసాగింది. గతంలో చేపట్టిన సర్వే ఆధారంగా లోపాలను సరిచేసుకుంటూ అధికారుల బృందం ముందుకు సాగింది. ఇంటింటికి వెళ్లి కుటుంబ సభ్యుల పూర్తివివరాలను సేకరించారు. సర్వే మొదటి రోజున దాదాపు 10 ఇళ్లు బోగస్‌గా తేలినట్లు సమాచారం. స్థానిక తహసీల్దార్ నర్సింగ్‌రావు సర్వేను పరిశీలించారు. మరో రెండు మూడు రోజులు సర్వే కొనసాగనుంది.

క్షేత్రస్థాయి పరిశీలనే కీలకం

- వార్డుల్లో ముమ్మరంగా స్వచ్ఛత కార్యక్రమాలు
- వచ్చే నెల 25 వరకు సిటిజన్ ఫీడ్ బ్యాక్ సేకరణ
- తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన



శ్రీనివాసకాలనీలో ప్రజలకు చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కేంద్ర పట్టణాభివృద్ధి సంస్థ, స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో ఏటా పట్టణాలు, నగరాల పరిశుభ్రతపై సర్వే నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి మార్కులు వేయనున్నారు. ఇదే ఉత్తమ ర్యాంకు రావడానికి కీలకమైన అంశంగా పేర్కొనవచ్చు. లక్ష నుంచి మూడు లక్షల వరకు జనాభా కలిగిన పట్టణాల జాబితాలో మహబూబ్‌నగర్ ఉండగా, దేశవ్యాప్తంగా ఈ కేటగిరిలో సుమారు 4,800 మున్సిపాలిటీలు ర్యాంకు కోసం పోటీ పడుతున్నాయి. ఇందులో మొత్తం 12,500 మార్కులు ఉంటాయి. వీటిలో ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ – బహిరంగ మల,మూత్ర విసర్జన రహితం (ఓడీఎఫ్), మురుగునీటి శుద్ధి తదితర అంశాలకు 1,200, గార్బేజ్ ఫ్రీ సిటీ (జీఎఫ్‌సీ)కి 1,300, సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్ (ఎస్‌ఎల్‌పీ) కి 5,700, సిటిజన్ ఫీడ్ బ్యాక్ (సీఎఫ్‌బీ) కు 500, రెడ్యూస్–రీయూజ్–రీసైకిల్ (ఆర్ఆర్ఆర్) తో పాటు మిగిలిన అంశాలకు కలిపి 4,800 మార్కులు ఉంటాయి. కొన్నినెలలుగా మహబూబ్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డులలో స్వచ్ఛ సర్వేక్షణ్–2024 కింద వివిధ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. పట్టణంలో చెత్త సేకరణకు 45 స్వచ్ఛ ఆటోలు ఉండగా, ఇటీవల మరో 20తో పాటు అలాగే భూగర్భ డ్రెయినేజీ నుంచి మురుగు తొలగించేందుకు జెట్టింగ్ మెషిన్ కొనుగోలు చేశారు. కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్ యార్డులో శానిటరీ ఇన్‌సినరేటర్ ఏర్పాటు చేస్తున్నారు.

సీఎఫ్‌బీలో మొత్తం 10 ప్రశ్నలు

ఇక ఈనెల 15 నుంచి ఇంటింటికీ ప్రత్యేక బృందం వెళ్లి చెత్తను ఎక్కడ బడితే అక్కడ వేయొద్దని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి ఒక్కరి నుంచి తమ మొబైల్‌లో సిటిజన్ ఫీడ్ బ్యాక్ (సీఎఫ్‌బీ)కు సంబంధించిన అంశాలను తెలియజేసి అప్పటికప్పుడు స్వచ్ఛ యాప్, వెబ్‌సైట్‌లో నమోదు చేయిస్తున్నారు. దీనిలో మొత్తం 10ప్రశ్నలు ఉన్నాయి. ఈ కార్యక్రమం వచ్చే నెల 25వ తేదీ వరకు కొనసాగనుంది. మొత్తం మార్కులలో 5 శాతం ఈ విభాగానికి కేటాయించారు. మరోవైపు ఆయా వీధుల్లో పారిశుద్ధ్య సిబ్బందితో డ్రెయినేజీలు, రోడ్లను మున్సిపల్ అధికారులు శుభ్రం చేయిస్తున్నారు. తరచూ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తనిఖీ చేస్తూ తగు సూచనలు ఇస్తున్నారు. ఇప్పటికే పట్టణం ఓడీఎఫ్ ప్లస్ విభాగంలో నమోదు కాగా ఓడీఎఫ్ ప్లస్ ప్లస్ కోసం రెండేళ్ల నుంచి దరఖాస్తు చేస్తూనే ఉన్నారు.

నెలాఖరున రానున్న కేంద్ర బృందం

స్వచ్ఛ సర్వేక్షణ్–2024 సర్వేలో భాగంగా మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ కి ఈనెలాఖరున కేంద్ర బృందం రానుంది. వివిధఅంశాలను పరిగణలోకి తీసుకొని రాండమ్‌గా మూడువిడతలుగా క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా తనిఖీ చేయనున్నారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తికావడానికి మూడు నెలలు పట్టొచ్చు. దీనిఆధారంగానే ర్యాంకులను ప్రకటిస్తారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ 2022కు గాను ఓడీఎఫ్ ప్లస్‌తో పాటు తుదిఫలితాల్లో జాతీయస్థాయి(దక్షిణం)లో 109, 2023కు గాను 97వ స్థానంలో నిలిచింది. ఈసారి అంటే 2024కు గాను ఇంకా మెరుగైన ర్యాంకు వస్తుందని అధికారులు చెబుతున్నారు.

పట్టణాన్ని శుభ్రంగా ఉంచుతున్నాం..



పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అన్నివార్డుల్లో చెత్త సేకరణకు స్వచ్ఛఆటోలను ఏర్పాటుచేశాం. ప్రతి ఒక్కరూ వీటికి అందజేయాలి. త్వరలో ఢిల్లీ నుంచి ప్రత్యేకబృందాలు క్షేత్రస్థాయి పరిశీలనకు రానున్నాయి. స్వచ్ఛతలో ఈసారి మెరుగైన ర్యాంకు సాధిస్తాం.

డి.మహేశ్వర్‌రెడ్డి,
మున్సిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్

వయోవృద్ధులకు ప్రత్యేక చట్టాలు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మున్వర్ హుస్సేన్

నవాబుపేట: వయోవృద్ధులకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని అందరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జూనియర్ సివిల్ జడ్జి మున్వర్ హుస్సేన్ సూచించారు. శనివారం న్యాయ సేవాసంస్థ ద్వారా మండలంలోని కొండాపూర్ గ్రామంలో జరిగిన న్యాయసేవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వయోవృద్ధులను పట్టించుకోకుండా వదిలేస్తే అలాంటి పిల్లలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చేనెల 8న జరిగే జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అవగాహన లేక క్షణికావేశంతో చిన్నిచిన్న సమస్యలకు కేసులు పెట్టుకున్నవారు ఈ సందర్భంగా తమ కేసులను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఎస్ఐ విక్రమ్, డిప్యూటీ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ యోగేశ్వర్, న్యాయవాదులు రవికుమార్, రామకృష్ణ, లీగల్ అడ్వైజర్ చౌదరి వెంకటేశ్వరప్ప, చంద్రశేఖర్ ఉన్నారు.

వైభవంగా విశ్వనాథేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న పురోహితులు

స్టేషన్ మహబూబ్‌నగర్: న్యూమోతీనగర్‌లోని శ్రీ అన్నపూర్ణా సమేత కాశీ విశ్వనాథేశ్వరస్వామి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం, శ్రీకాలభైరవస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనం, రక్షాబంధనం, దీక్షాధారణం, అంకురారోహణం, సాయంత్రం అవాహిత సర్వదేవతా హోమం, జలాధివాసం, విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. ఆదివారం మండప దేవతపూజలు, పీఠపూజ, నవరత్నన్యాసం, చండీహోమం, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, అష్టబంధనం, మహాపూర్ణాహుతి, మహాసంప్రోక్షణ పూజలు ఉంటాయని ఆలయ ధర్మకర్త చైర్మన్ ఎస్.ప్రభాకర్ తెలిపారు. శ్రవణ్‌కుమార్‌శర్మ, వెంకటేశ్వరశర్మ, పవన్‌కుమార్ శర్మ, రామకృష్ణశర్మ, రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు రాములు యాదవ్, యాదగిరి, రవికుమార్ పాల్గొన్నారు.

ఫూలే–అంబేడ్కర్ జాతరపై తీర్మానం

మహబూబ్‌నగర్ రూరల్: ఫూలే–అంబేడ్కర్ జాతరను ఏప్రిల్ నెలాఖరులో రాత్రి సమయంలో కాకుండా ఉదయం పూట నిర్వహించాలని జాతర కమిటీ నాయకులు తీర్మానించారు. ఈమేరకు స్థానిక ఎస్సీ కమ్యూనిటీహాల్‌లో శనివారం జాతర కమిటీ నాయకులు సమావేశమై జాతర నిర్వహణపై చర్చించారు. ఈనెల 28వ తేదీ మరోసారి నిర్వహించే సమావేశానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వివిధ కుల సంఘాల నాయకులు హాజరై తమ సలహాలు, సూచనలివ్వాలని జాతర వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సిములు, కమిటీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు కోరారు. నాయకులు యాదగిరినాయక్, కేశవులు, లక్ష్మణ్, మాసయ్య, జంగయ్య, నర్సిములు, విద్యావతి, వాసు, హన్మంతు, రాందాస్, రాజు, బాలనరసింహా, రాములు, శ్యామ్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

- పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఇందిరమ్మ నమూనా ఇల్లు ప్రారంభం



ఇందిరమ్మ నమూనా ఇల్లును ప్రారంభించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఓబ్లాయిపల్లి గ్రామంలో నిర్మించిన ఇందిరమ్మ నమూనా ఇల్లును ఆయన ప్రారంభిచారు. అనంతరం పోతన్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. రూ.10లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించి, రూ.40లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు 2004– 14లో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల గురించి గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వైద్యం భాస్కర్ రాసిన ఇందిరమ్మ థీమ్ సాంగ్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఎంపీడీఓ కరుణశ్రీ, తహసీల్దార్ సుందర్‌రాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు మాధవరెడ్డి, గోవింద్, సుధాకర్ రెడ్డి, పోతన్‌పల్లి మోహన్‌రెడ్డి, రామచంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గోపాల్, సత్యన్న, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్వామి కృప అందరిపై ఉండాలి

శ్రీలక్ష్మీనరసింహాస్వామి వారి కృప అందరిపైన ఉండాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మన్యంకొండ శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి దేవాలయ ప్రాంగణంలో రూ.10లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. అంతకుముందు శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అతి పురాతనమైన ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యేకు స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, దేవస్థానం చైర్మన్ మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూ పరింటెండెంట్ నిత్యానందచారి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులున్నా..

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 130 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. ముడా చైర్మన్ లక్ష్మణ్ యా దవ్, తహసీల్దార్ ఘాన్సీరాం, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, నాయకులు నాగరాజు, ఫైసల్, ఫ యాజ్, రాషెద్‌ఖాన్, అజ్మత్‌అలీ, జహీర్, ఖాజ పాషా, అంజద్, మునీర్, మొయిజ్ పాల్గొన్నారు.

విద్యా నిధికి ప్రతి ఒక్కరూ సహరించాలి

పాలమూరు: విద్యానిధికి పంచవటి విద్యాలయం యాజమాన్యం రూ.5లక్షల చెక్కును శనివారం రా త్రి కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కలెక్టర్ విజయేందిర బోయికి పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యానిధికి చేయూత ఇచ్చి న పంచవటి యాజమాన్యాన్ని అభినందించారు. మహబూబ్‌నగర్‌లో ఉన్న ప్రతిఒక్కరూ విద్యాని ధికి సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రతి ఏడాది పంచవటి నుంచి విద్యా నిధి కోసం రూ.5లక్షల విరాళం అందజేస్తామని పంచవటి పాఠశాల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. అదనపు కలెక్టర్ మోహన్‌రావు, నాగరాజు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర మలుపు

- ఇక్కట్లు పడుతున్న వాహనదారులు
- కనిపించని సూచిక బోర్డులు, వేగనిరోధకాలు



పెద్దమునుగల్‌ఛేడ్ వద్ద రోడ్డు మలుపు

అడ్డాకుల: మండలంలోని పెద్దమునుగల్‌ఛేడ్ గ్రామానికి వెళ్లే దారిలో పలుచోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. చిన్నమునుగల్‌ఛేడ్ నుంచి వెళ్లే దారిలో చెరువు కట్ట దాటిన తర్వాత రోడ్డు మలుపులు తిరిగి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంట వెంటనే మలుపులు ఉండటంతో ఇక్కడ వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. ఈ మలుపులవద్ద ఆటోలు, ద్విచక్రవాహనాలు పలుమార్లు ప్రమాదాలకు గురయ్యాయి. అక్కడ ఎలాంటి సూచికబోర్డులు, వేగనిరోధకాలు ఏర్పాటు చేయలేదు. రాత్రివేళ కాస్త వేగంగా వెళ్లినా ప్రమాదానికి గురయ్యే అవకాశముంది. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్కౌట్స్, గైడ్స్ ఆధ్వర్యంలో వరల్డ్ థింకింగ్‌డే

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత్ స్కౌట్స్, గైడ్స్ వ్యవస్థాపకులు లార్డ్ బైడెన్ పావెల్ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం వరల్డ్ థింకింగ్‌డే నిర్వహించినట్లు ఆర్గనైజింగ్ కమిషనర్ రాజగోపాల్ తెలిపారు. ఈసందర్భంగా బైడెన్ పావెల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటయ్య, వెంకటలక్ష్మి, స్వరూపారాణి, శ్వేత, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దేవరకద్ర: మండలంలోని గూరకొండలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. గ్రామంలో సీసీ రోడ్ల పనుల కోసం 40 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక కోసం ఒక్కో ట్రిప్పుకు రూ. 600 ప్రకారం డీడీలు తీసి తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్చి అనుమతి తీసుకున్నారు. శుక్ర, శనివారాల్లో ఇసుకను తరలించడానికి టోకెన్లను జారీ చేశారు. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో 40 ట్రిప్పులు పూర్తయ్యాక కూడా అదనంగా మరో 40ట్రిప్పుల ఇసుకను తరలించినట్లు సమాచారం. ఈవిషయమై అప్రమత్తమైన అధికారులు వాగు వద్దకు చేరుకొని ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. పట్టుకున్న ట్రాక్టర్‌కు సా యంత్రం వదిలివేశారు. మండలంలోని వెంకటాయపల్లి, కౌకుంట్ల మండలంలో టిప్పర్లతో ఇసుక అక్రమరవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలున్నాయి.

విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ కృషి



ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: భారత ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ దేశంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషిచేశారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా చైర్మన్ మహ్మద్ ఫయాజ్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అబుల్ కలామ్ ప్రవేశ పెట్టిన విద్యారంగ సంస్కరణలు ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం జిల్లా చైర్మన్ మహ్మద్ ఫయాజ్ మాట్లాడుతూ దేశంలో అనేక విద్యాసంస్థల రూపకల్పనలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ తన వంతు పాత్ర పోషించారన్నారు. ఆయన చూపిన బాటలో నడుద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మీడియాసెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అవేజ్ అహ్మద్, మైనార్టీ విభాగం నాయకులు ఫక్రుద్దీన్ ఖురేషి, మహ్మద్ జహీర్, పీర్ సాధిక్, షాఫైసల్, మహ్మద్ అక్బర్, మహ్మద్ ఫహీం, జమీల్, రఫీ, వహీద్, బండ సునీల్, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, రాంచంద్ర, మొయిజ్, బాసిత్, అలీ, అలీం, నయీమ్, అబుబకర్, ఖాదర్, అష్షు పాల్గొన్నారు.

కుంభమేళా జలంతో అభిషేకాలు

అడ్డాకుల: మండలంలోని కన్మనూర్‌లో కుంభమేళా జలంతో శనివారం అభిషేకాలు నిర్వహించారు. వీరశైవాగమ విద్వన్మని శివశ్రీ సురేష్ శాస్త్రి ప్రయాగ్‌రాజ్ పుణ్యక్షేత్రం త్రివేణి సంగమం నుంచి అమృతబిందు ఫలజలానికి గంగాపూజ నిర్వహించి గ్రామానికి తీసుకొచ్చారు. గ్రామంలోని పార్వతిసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ ఆవరణలోని కురుమూర్తి స్వామి దీపస్తంభం, బీచుపల్లి ఆంజనేయస్వామి, సింగోటం లక్ష్మీ నర్సింహస్వామి దీప స్తంభాలు, గ్రామ దేవత, మైసమ్మ, పోషమ్మ, ఊరడమ్మతల్లి దేవత విగ్రహాలకు కుంభమేళా జలంతో అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యం, సుఖసంతోషాలతో వర్ధిల్లాలనే అభిషేక సంప్రోక్షణను నిర్వహించినట్లు పండితుడు సురేష్ శర్మ తెలిపారు.

సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విద్యార్థులు సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని పీయూ వీసీ శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాల ఫెస్ట్–2025 కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సెల్‌ఫోన్‌తో అత్యంత ప్రమాదకరంగా మారిందని, అనేక అనర్థాలున్నాయని, ఫోన్‌తో గడిపే సమయాన్ని అమ్మమ్మ, తాతయ్యలతో గడపే విధంగా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వీటితో పాటు నేటి కాలంలో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు డాక్టర్, ఇంజనీరింగ్ కావాలని కోరుకుంటున్నారని, కానీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విద్యావిధానంలో విద్యార్థులకు సైన్స్, ఆర్ట్స్,మ్యాథ్స్ వంటి వాటిలో ఏదైనా సబ్జెక్టును ఎంపిక చేసుకునే విధంగా రూపొందించారన్నారు. విద్యార్థి ఇష్ట మేరకు చదువులు ఉండాలని, అప్పుడే పూర్తి స్థాయి పరిపక్వత ఏర్పడుతుందన్నారు. పాఠశాల చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, అడ్వకేట్ బెక్కం జనార్దన్, ప్రిన్సిపాల్ మమత పాల్గొన్నారు.

పింఛన్ పైసలతో పన్నులు

- ముక్కుపిండి ఇంటి పన్ను వసూలుచేస్తున్న గ్రామ కార్యదర్శి
- ఆవేదన వ్యక్తం చేస్తున్న వృద్ధులు



కొత్త మొల్గర పంచాయతీ కార్యాలయానికి పింఛన్ కోసం వచ్చిన వృద్ధులు

భూత్పూర్ : వృద్ధులకు వచ్చే పింఛన్ పైసలను సైతం వదలడం లేదు అధికారులు. పింఛన్ డబ్బులు రాగానే వాటిని ఇంటి పన్నుకు జమ చేసుకుంటున్న ఘటన శనివారం మండలంలోని కొత్త మొల్గరలో చోటుచేసుకుంది. పంచాయతీ కార్యాలయం వద్ద వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పోస్టుమాస్టర్ వచ్చి పింఛన్లు అంజేస్తారు. ఇంటింటికీ వెళ్లి కలెక్షన్ చేయలేక గ్రామ కార్యదర్శి పంచాయతీ కార్యాలయం వద్దే ఉండి వృద్ధులకు పింఛన్ పైసలు రాగానే వాటిని ఇంటి పన్నుకు సరిచేసుకుంటున్నాడు. గత్యంతరం లేక వచ్చిన రూ.2016లో సగానికి పైగా డబ్బులను ఇంటి పన్నును వృద్ధులు చెల్లించక తప్పలేదు. గతంలోనూ గ్రామ కార్యదర్శి పింఛన్‌కు వచ్చే వృద్ధులను ఇంటి పన్ను వసూలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన చిల్లా రఘురెడ్డి తల్లి పింఛన్ తీసుకోవడానికి పంచాయతీ వద్దకు వెళ్లింది. ఆమె పింఛన్ తీసుకున్న వెంటనే ఇంటి పన్ను చెల్లించాలని కార్యదర్శి ఒత్తిడి చేయగాపన్ను చెల్లించింది. ఈ విషయాన్ని కుమారుడికి చెప్పడంతో పంచాయతీ కార్యాలయానికి వచ్చి అడగగా వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. వృద్ధుల పింఛన్ డబ్బులు ఇంటిపన్నుకు ఎలా ముడిపెడుతారని, ఇలా చేయడం తగదన్నారు.

వృద్ధులను ఇబ్బంది పెట్టడం లేదు

వృద్ధుల పింఛన్ డబ్బులు ఇంటి పన్నుకు జమ చేసిన విషయమై గ్రామకార్యదర్శి మొగిలిరెడ్డిని సంప్రదించగా ఇంటిపన్ను చెల్లించాలని ఇంటింటికెళ్లి నిత్యం అడుగుతున్నానని, పింఛన్ డబ్బులు వచ్చాక చెల్లిస్తామని యజమానులు చెప్పారు. పింఛన్ డబ్బులు తీసుకొని యజమానులే కార్యాలయానికి వచ్చి ఇంటిపన్ను చెల్లించారన్నారు. తాను ఎప్పుడు వృద్ధులను ఇబ్బంది పెట్టలేదని ఆయన తెలిపారు.

దేవాలయానికి రూ.1.99లక్ష విరాళం

దేవరకద్ర: మండల కేంద్రంలోని ప్రసిద్ధి చెందిన ఈశ్వర వీరప్పయ్యస్వామి దేవాలయ పునర్నిర్మాణం కోసం శనివారం దివంగత గోవింద వెంకట కృష్ణయ్య జ్ఞాపకార్థం ఆయన భార్య గోవింద లలితమ్మ, కుమారులు గోవింద సుదర్శన్, అరుణ, శ్రీనివాసులు, లావణ్య రూ.1.99లక్షలు విరాళం అందజేశారు. దేవస్థాన కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మాజీ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వీరారెడ్డి, ప్రతాపులు, విజయభాస్కర్‌రెడ్డి, కెవీరాజు పాల్గొన్నారు.